RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

సంపుటి - 02 సంచిక - 26 పేజీలు - 04 వెల - 04/- శనివారం 26 అక్టోబర్ 2024

# ఉచిత ఇసుక పాలసీలో సీనరేజి రద్దు

ఏపీలో ఉచిత ఇసుక పాలసీ- 2024లో సీనరేజ్ ఛార్జిని మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా జీవోను విడుదల చేశారు.

## ఇంటి నిర్మాణాలకు ఉచితంగా సరఫరా

- ఉచిత ఇసుక పాలసీ ఉత్తర్వులు జారీ
- కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా ఆదేశాలు
- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలకు ఆదేశం



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:
ఉచిత ఇసుక పాలసీపై ఈ నెల 21న జరిగిన కేబినేట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో, ఎటువంటి రుసుం చెల్లించకుండానే నిర్మాణ అవసరాలకు ఇసుకను తీసుకువెళ్లేలా ఆదేశాల్లో పేర్కొంది. నిర్మాణ రంగం వల్ల ఉపాధి ఆదాయం పెరుగుతున్నందున ఉచిత ఇసుక పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు చేపట్టిన్నట్లు జీవోలో పేర్కొంది. దీనిలో భాగంగా సీనరేజ్ ఫీజు, మెరిట్ అన్ శాండ్, డీఎంఎఫ్ మాఫీకి చర్యలు చేపట్టినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

మిగతా 2లో




# ముద్ర లోన్ ఇక రెండింతలు!

- పీఎంఎంవై కింద ఇప్పటి వరకు రూ.10 లక్షల రుణం
- రూ.20 లక్షలకు పెంచుతున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటన
- బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల ద్వారా ముద్ర రుణాలు

కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) కింద ఇచ్చే రుణ పరిమితిని రెండింతలు చేసింది. ఈ స్కీం కింద ఇప్పటి వరకు రూ.10 లక్షల వరకు రుణం ఇస్తున్నారు. దీనిని రూ.20 లక్షలకు పెంచుతున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించారు.
బడ్జెట్ ప్రవేశపెట్టిన 2024 జులై 23 నుంచి ఇది అమలులోకి వచ్చినట్లు తెలిపారు. ఆర్థిక మద్దతు, కొత్త వ్యాపారాల అభివృద్ధి, విస్తరణకు మద్దతు ఇవ్వడం పీఎంఎంవై ప్రధాన ఉద్దేశం. ఈ స్కీంను 2015లో మోదీ ప్రభుత్వం ప్రారంభించింది. సమీప బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి ముద్ర లోన్లు వస్తాయి.

## ఐరాస సమావేశాలకు ఎంపీ శబరికి ఆహ్వానం



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 25:
నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి ఐక్యరాజ్య సమితి (ఐరాస) సమావేశాలకు ఆహ్వానం అందింది. అమెరికాలో నవంబర్ 18 నుంచి 22 వరకు జరగనున్న 79వ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో దేశ ప్రతినిధిగా మాట్లాడే అవకాశం కల్పించిన ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఎంపీ బైరెడ్డి శబరి ధన్యవాదాలు తెలిపారు.

# ఈ దీపావళి నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్లు...

- విధివిధానాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల
- రాష్ట్రంలోని అర్హులందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు
- ఎన్నికల హామీని నిలబెట్టుకుంటున్నామన్న మంత్రి నాదెండ్ల






అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:
రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఈ దీపావళి నుంచే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, సంబంధిత మార్గదర్శకాలను, విధి విధానాలను నిర్దేశిస్తూ ఇవాళే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. సచివాలయం నాలుగో బ్లాక్ ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. ఈ నెల 31 న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, తదుపరి వెంటనే ప్రతి ఇంటికీ మొదటి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఎల్.పి.జి.కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు.

మిగతా 2లో




2లో

## ఎపికి తరలిరండి

సినీ పరిశ్రమకు మంత్రి కందుల పిలుపు

## హెూటళ్లకు బాంబు బెదిరింపు.. ఉలిక్కిపడ్డ తిరుపతి




2లో

# అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ 'గార్డియన్' మాత్రమే..


- వైఎస్ ఉద్దేశమేంటో కుటుంబ సభ్యులకు తెలుసు: షర్మిల
- వైఎస్సార్ అభిమానులకు వైఎస్ షర్మిల 3 పేజీల బహిరంగ లేఖ
- వైఎస్ ఉన్నప్పుడు స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలేనన్న షర్మిల
- ఆయన స్థాపించిన వ్యాపారాలు జగన్ సొంతం కాదని వ్యాఖ్య
- ఇవాళ్టి వరకు తనకు న్యాయంగా రావాల్సిన ఆస్తి కూడా తన చేతుల్లో లేదని ఆవేదన
- వైఎస్ బతికి ఉన్నప్పుడే ఆస్తులు పంపిణీ చేశారనేది పూర్తిగా అవాస్తవమన్న షర్మిల

2లో



## ఐకాన్ స్టార్ కు హైకోర్టులో ఊరట

నవంబరు 6 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దు : న్యాయస్థానం





2లో

# ఈ దీపావళి నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్లు...

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రంలో 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు, 1.47 రేషన్ కార్డులు ఉన్నాయని, వీరిలో అర్హులు అందరికీ ఈ పథకం వర్తింపచేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం అమలుకై ప్రతి ఏడాది ప్రభుత్వం పై రూ.2,684.75 కోట్ల మేర భారం పడుతుందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కుంటున్నా సరే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.

### విధివిధానాలు...

ఈ పథకం అమల్లో భాగంగా ఈ నెల 29 నుంచి గ్యాస్ బుకింగ్స్ ప్రారంభిస్తారు. గ్యాస్ బుకింగ్ చేసుకోగానే ఒక ఎస్.ఎం.ఎస్. సంబంధిత లబ్ధిదారుని ఫోన్ నెంబరుకు వెళుతుంది.
పట్టణ ప్రాంతాల్లో అయితే గ్యాస్ బుక్ చేసుకున్న 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో అయితే గ్యాస్ బుక్ చేసుకున్న 48 గంటల్లో సిలిండ్లను డెలివరీ చేస్తారు.
అదే విధంగా, గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసిన 48 గంటల్లోనే డి.బి.టి. విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా రాయితీ సొమ్ము జమ చేస్తారు. ప్రభుత్వం అందజేసే మూడు ఉచిత సిలిండర్లలో మొదటి సిలిండర్ మార్చి 31 లోపు, రెండోది జూలై 31 లోపు, మూడోది నవంబరు 30 లోపు ఎప్పుడైనా పొందవచ్చు. ఈ పథకం అమలుకై ఏడాదిని మూడు బ్లాక్ పీరియడ్లు పరిగణిస్తారు. మొదటి బ్లాక్ పీరియడ్ ఏప్రిల్ 1 నుండి జూలై 31 వరకు, రెండో బ్లాక్ పీరియడ్ ను ఆగస్టు 1 నుండి నవంబరు 31 వరకు మరియు మూడో బ్లాక్ పీరియడ్ ను డిసెంబరు 1 నుండి మార్చి 31 వరకు పరిగణిస్తారు.
ఈ పథకం అమల్లో లబ్ధిదారులకు సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెం.1967 కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు.
కాగా, ఈ పథకం అమలుకు సంబంధించి ఇప్పటికే మూడు ఆయిల్ కంపెనీలతో మాట్లాడం జరిగిందని, ఆయిల్ కంపెనీల వద్ద మరియు ప్రభుత్వం వద్ద ఉన్న డేటాను సమన్వయం చేసుకుంటూ ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. ఈ పథకం అమలుకై ఆయిల్ కంపెనీలకు అడ్వాన్సుగా రూ.894.92 కోట్లను ఈ నెల 29న చెక్కు రూపేణా చెల్లించడం జరుగుతుందన్నారు.

# ఉచిత ఇసుక పాలసీలో సీనరేజి రద్దు

(మొదటి పేజీ తరువాయి)
స్థానికంగా ఇసుక లభ్యత రవాణా పెరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. ఇసుక బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించేలా విజిలెన్స్‌ను సైతం పటిష్టం చేయాలని నిర్ణయించింది. ఇసుక లభ్యతను పెంచేలా ప్రస్తుత ఇసుక పాలసీలో మార్పులు, చేర్పులు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఉచిత ఇసుకపై ఉన్న పన్నులు, స్వయంగా ఇసుక తవ్వకం, తరలింపు, ఇసుక లభ్యం కాని జిల్లాల్లో స్టాక్ యార్డులు ఏర్పాటు చేయాలని సూచించింది. విజిలెన్స్ మానిటరింగ్‌పై విధివిధానాలను మార్పులు చేసింది. ఇసుక అక్రమంగా తరలిపోకుండా జీపీఎస్, చెక్ పోస్టుల వద్ద తనిఖీలకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. నిర్మాణ రంగంతో ఉపాధి ఆదాయం పెరుగుతున్నందున ఉచిత ఇసుక పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా సినరేజీ ఫీజు, మెరిట్ అన్ శాండ్ , డీఎంఎఫ్ మాఫీకి చర్యలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. ఇసుక అక్రమంగా తరలి పోకుండా జీపీఎస్. చెక్ పోస్టుల వద్ద పటిష్ట తనిఖీలకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉచిత ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ విధానం అమలు చేస్తుంది. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పోర్టల్‌ను అవిష్కరించారు. దీంతో గ్రామ వార్డు సచివాలయాల్లో ఇసుక బుక్ చేసుకునే అవకాశం ఉంది. అధికారుల నుంచి ఇసుక రవాణా దారుల వరకు ఎలాంటి తప్పులు చెయ్యకుండా పోర్టల్ రూపకల్పన చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధికారుల నేతృత్వంలో కమిటీలు వేశారు. ఇసుక స్టాక్ ఎంత ఉంది... సరఫరా కేంద్రాలు ఎన్ని ఉన్నాయి.. అనే వివరాలతో పోర్టల్ రూపొందించారు. వేల చదరపు అడుగుల లోపు నిర్మాణాల వరకు సాధారణ బుకింగ్ పరిధిలో... 2వేల చదరపు అడుగులు మించితే బల్క్ విధానంలో బుకింగ్ చేసుకోవాలి. ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్, యాప్‌ను అధికారులు సిద్ధం చేశారు. ఉచిత ఇసుక విధానం నేపథ్యంలో ఇసుక కావాల్సినవారు ఇంటి వద్ద నుంచే నేరుగా బుక్ చేసుకునేందుకు వీలుగా ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. కాగా..ఉచిత ఇసుక దారి మళ్లకుండా, ఇతరులు అధిక ధరలకు అమ్మకుండా నిఘా ఉంచేందుకు జిల్లాల వారీగా టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఏ జిల్లాకు ఆ జిల్లా కలెక్టరే ఇందులోని అధికారులను నియమిస్తారు. గనులశాఖ, పోలీస్, ఎక్సైజ్, నీటిపారుదల, భూగర్భజలవనరులు.. తదితర శాఖల అధికారులతో కూడిన బృందం విస్తృతంగా తనిఖీలు చేయనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాత ఇసుక విధానాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 2024 ఇసుక విధానం రూప కల్పన వరకూ సరఫరాకు మార్గదర్శకాలు జారీ చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. కొత్త ఇసుక విధానాన్ని తెచ్చే వరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి వరకు వినియోగదారుడికి ఉచితంగా ఇసుక ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీవో నంబర్ 43ను జారీ చేసింది. వినియోగదారుడు ఎత్తుడు, దించుడు కూలీతో ఇతర చట్టబద్ధమైన పన్నులు చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. 2024 కొత్త ఇసుక విధానాన్ని రూపొందించేంత వరకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ లేకుండా ఇసుక సరఫరా జరపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వినియోగదారులకు ఇసుకను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఇసుక సరఫరాపై మార్గదర్శకాల విడుదల చేసింది. ఇసుక తవ్వకాల నిమిత్తం జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఇసుక కమిటీల్లో జిల్లా ఎస్పీ, జేసీ సహా వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఉండనున్నారు. జిల్లాల్లోని స్టాక్ పాయింట్లను స్వాధీనం చేసుకోవాలని జిల్లా ఇసుక కమిటీలకు సర్కార్ సూచనలు చేసింది. 9 లక్షల మెట్రిక్ టన్నుల మేర ఇసుక రాష్ట్రంలోని వివిధ స్టాక్ పాయింట్లల్లో అందుబాటులో ఉందని ప్రభుత్వం వెల్లడించింది. ఇసుకను తిరిగి విక్రయించినా ఇతర రాష్ట్రాలకు తరలించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. భవన నిర్మాణ మినహా ఉచిత ఇసుకను మరే ఇతర అవసరాలకు వినియోగించొద్దని స్పష్టం చేసింది. ఇసుక అక్రమ రవాణా చేసినా, ఫిల్లింగ్ చేసినా పెనాల్టీలను నిర్ధారిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ 'గార్డియన్' మాత్రమే..

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. వైఎస్ఆర్ అభిమానులకు సంచలన లేఖ రాశారు. 3 పేజీల బహిరంగ లేఖ రాసిన ఆమె.. అందులో సంచలన విషయాలు వెల్లడించారు. సాక్షి పేపర్, ఛానెల్‌లో తనపై ప్రసారం చేస్తున్న వార్తలపై స్పష్టతను ఇస్తూ.. ఇవీ వాస్తవాలంటూ కీలక వివరాలను వెల్లడించారు. వైఎస్ అభిమానులకు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నంలో భాగంగానే ఈ లేఖ రాసినట్లు పేర్కొన్నారు. 'ఈరోజు పొద్దున సాక్షి పేపర్ చూశాను. సాక్షి మీడియా జగన్ మోహన్ రెడ్డి చేతిలో ఉంది. కాబట్టి ఏదైనా నమ్మించగలరు. అయినా వైఎస్సార్ అభిమానులకు అసలు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నం నాది. అమ్మ వైఎస్ విజయమ్మ, నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి గురించి ఒక పుస్తకం రాశారు. అందులో నాన్న గురించి ప్రత్యేకంగా ఒక మాట రాశారు. 'రాజశేఖర్ రెడ్డి గారికి లోకం అంతా ఒకెత్తయితే.. తన బిడ్డ షర్మిల ఒకెత్తు అని రాశారు. నాన్నకు నేనంటే ప్రాణం. నాన్న నన్ను ఎప్పుడూ ఆడపిల్ల కదా అని చిన్న చేసో, తక్కువ చేసో చూడలేదు. నాన్న బతికి ఉన్నన్ని రోజులూ ఒకే మాట అనేవారు. 'నా' నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ నాకు సమానం. వైఎస్సార్ బతికి ఉండగా స్థాపించిన అన్ని కుటుంబ వ్యాపారాల్లో నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ కూ సమాన వాటా ఉండాలి. రాజశేఖర్ రెడ్డి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలే. అవి జగన్ మోహన్ రెడ్డి సొంతం కాదు. ఉన్న అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ 'గార్డియన్' మాత్రమే. అన్ని వ్యాపారాలు నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచి పెట్టాల్సిన బాధ్యత ఆయనదే. ఇది రాజశేఖర్ రెడ్డి మ్యాండేట్. వైఎస్సార్ ఈ ఉద్దేశం ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, కేవీపీ రామచంద్రరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి సహా సన్నిహితులందరికీ స్పష్టంగా తెలుసు. నాన్న బతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో సరస్వతి, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏమైనా.. నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ కు సమాన వాటా ఉండాలన్నది వైఎస్ఆర్ మ్యాండేట్. ఒక్క సండూర్ మినహా రాజశేఖర్ రెడ్డి బతికున్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్సార్ హఠాత్తుగా మరణించారు. తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈరోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదు. స్వార్జితం అని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే. రాజశేఖర్ రెడ్డి బతికి ఉన్నప్పుడే ఆస్తులు పంపిణీ చేశారనేది అవాస్తవం. ఈరోజు సాక్షిలో చూపినట్లుగా మా తాతల ఆస్తి చిన్నప్పుడే నా పేరు మీద పెట్టినంత మాత్రాన, అది నాన్న నాకు పంచిన ఆస్తి కాదు. ఇతరులతో ఒక వ్యాపారంలో చిన్న భాగం నా పేరు మీద పెడితే అది ఆస్తి పంచి ఇచ్చినట్లు కాదు. ఆస్తి పంచడం అంటే ఇవిగో ఈ ఆస్తులు.. నీకు ఇక ఇంతే అని మా నాన్న నాకు చెప్పి ఉంటే అది ఆస్తి పంచేయడమంటే..! నేను జగన్ మోహన్ రెడ్డి ఆస్తుల్లో వాటా అడుగుతున్నాను అనేది హాస్యాస్పదం. ఇవన్నీ కుటుంబ ఆస్తులు కనుక రాజశేఖర్ రెడ్డి నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచాలి అనుకున్నారు. కాబట్టే ఈ రోజు వరకు వీటి గురించి మాట్లాడుతున్నాం. నాకంటూ వ్యక్తిగతంగా ఈ ఆస్తులపై మోజు లేదు. వీళ్లు పెట్టిన హింసలకు ఈ ఆస్తులు కావాలనే కోరిక కూడా లేదు. కేవలం నా బిడ్డలకు ఈ ఆస్తులు చెందాలి అనేది రాజశేఖర్ రెడ్డి అభిమతం గనుక.. ఈ రోజు వరకు కూడా అమ్మైనా, నేనైనా తపన పడుతున్నాం. ఇప్పటికీ అమ్మ వెయ్యి సార్లు వీళ్లను అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా నా బిడ్డలకు చెందాల్సిన ఆస్తిలో ఒక్కటి కూడా ఇవ్వలేదు. రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత 10 ఏళ్లు జగన్ ఇబ్బందులు పడితే, అవి నా ఇబ్బందులు అనుకొని.. నా శక్తికి మించిన సాయం చేశాను. తోడబుట్టిన వాడికోసం నా బిడ్డలను సైతం పక్కనపెట్టి ఆయన్ను, ఆయన పార్టీని ఏ స్వార్థం లేకుండా నా భుజాల మీద మోశాను. ఆ 10 ఏళ్లు నా అవసరం ఉంది అనుకున్నారో.. ఏమో.. నన్ను బాగానే చూశారు. పెద్ద కూతురు అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఊహించినట్లుగానే గ్రాండ్ చిల్డ్రన్ నలుగురు సమానం అన్నట్లుగానే వ్యవహరించారు. ఆ 10 ఏళ్లలో రూ. 200 కోట్లు ఇచ్చామని చెప్తున్నది ఇందులో భాగంగానే. ఆ 10 ఏళ్లు నా బిడ్డలకు సమాన వాటా ఉందని గుర్తిస్తూ.. కంపెనీలోని డివిడెండ్‌లో సగం వాటా నాకు ఇవ్వడమే ఈ రూ. 200 కోట్లు. వాళ్లు చేసింది ఉపకారం కాదు. ప్రేమతో ఇచ్చింది అంతకంటే కాదు. నాకు సమాన వాటా ఉంది కాబట్టి డివిడెండ్‌లో సగం వాటా ఇచ్చారు. అది కూడా అప్పుగా చూపించమన్నారు. సీఎం కాగానే జగన్ గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. నాపై చిన్నచూపే కాదు.. సీఎం కాగానే విడిపోదామని ప్రతిపాదించారు. విడిపోవద్దని అమ్మ, నేను చెప్పాం. ఆస్తులు పంచుకుందామని విజయవాడకు రమ్మన్నారు. భారతి సిమెంట్స్, సాక్షిలో ఎక్కువ వాటా కావాలని అడిగారు. 60 శాతం తీసుకుంటా.. 40 శాతం ఇస్తా అని జగన్ ప్రతిపాదించారు. ఆ తర్వాత అరగంటలో ఆస్తుల వాటా తేలిపోయింది. కొద్ది వారాల్లోనే ఎంవోయూ కూడా తయారైంది. నాకు రావాల్సిన వాటా ఇచ్చారు తప్పితే.. ప్రేమాభిమానాలతో కాదు. 2021లో నేను రాజకీయాల్లో అడుగుపెట్టా. జగన్‌కు ఇష్టం లేకుండా వచ్చానని కోపమొచ్చింది. రాజకీయాల్లో నన్ను అణచి వేసేందుకు ఆయన చేయని ప్రయత్నం లేదు. ఆంధ్రాలో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తే అవమానించారు. సోషల్ మీడియాలో నాపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. నన్నే కాదు.. వివేకాపైనా సాక్షి మీడియాలో అసభ్యకరంగా ప్రచురించారు. ఎన్నికల్లో ఓటమికి నేనే కారణమని బలంగా నమ్మారు. విరోధం వద్దు.. మాట్లాడుకుందామని బంధువులను పంపారు. జగన్, భారతి, అవినాష్‌కు వ్యతిరేకంగా మాట్లాడొద్దని షరతు పెట్టారు. బంధువులు ఎంత ఒత్తిడి చేసినా ఆ షరతులకు నేను ఒప్పుకోలేదు. అదే కోపంతో మళ్లీ నాతో పాటు అమ్మపై ఎన్‌సీఎల్‌టీలో కేసు వేశారు. మేం మోసం చేసి షేర్లు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రజల్లో అమ్మపై కేసు వేసిన దుర్మార్గుడనే పేరు వస్తుందని మాట మార్చారు. జగన్ బెయిల్ రద్దుకు కుట్ర చేస్తున్నామనే అభియోగం మోపారు. నిజానికి బెయిల్ రద్దు కాదు.. ఎందుకంటే సరస్వతి షేర్స్ అటాచ్ కాలేదు. కంపెనీల్లో ఈడీ అటాచ్ చేసింది షేర్లను కాదు.. రూ.32కోట్ల విలువైన భూములనే. షేర్ల బదిలీకి, ఆయన బెయిల్ రద్దుకు ఎలాంటి సంబంధం లేదు. సొంత తల్లిని కోర్టుకు ఈడ్చడం.. చంద్రబాబు చేతిలో బాణం కావాల్సిన అవసరం వైఎస్సార్ బిడ్డకు లేదు. జగన్ ఎవరి కొంగు చాటున ఉండి ఇదంతా చేస్తున్నారో అందరికీ తెలుసు. ఆస్తి, అధికారం కోసం ఇదంతా చేస్తున్నారని ప్రజలంతా గమనిస్తున్నారు. నా గురించి తెలియాలనే వాస్తవాలను మీ ముందు ఉంచుతున్నా. నేను మోసం చేసినట్లు, ఆస్తి కోసం అత్యాశ పడినట్లు భావించవద్దనే ఈ లేఖ రాశా. ఎంవోయూ నా చేతుల్లో ఐదేళ్లున్నా.. ఒక్క ఆస్తి కూడా ఇవ్వలేదు. ఏ ఒక్క మీడియా, కోర్టుకు ఎంవోయూ విషయాన్ని నేను బయటపెట్టలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడినా కుటుంబ గౌరవం కోసం ఎంవోయూను బయటపెట్టలేదు. వైఎస్సార్ అభిమానులను మానసిక క్షోభకు గురిచేసిందెవరో మీకు తెలుసు. కుటుంబ బంధం, స్నేహబంధంతో మనుషులు ఒక్కటవుతారు. 'వైఎస్సార్ బంధం' ఏర్పరచుకున్న ప్రతి వైఎస్సార్ బంధువుకి వివరణ ఇస్తున్నా. అమ్మను, నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దనే వాస్తవాలు చెబుతున్నా'అని షర్మిల లేఖలో పేర్కొన్నారు.

# ఎపికి తరలిరండి
## సినీ పరిశ్రమకు మంత్రి కందుల పిలుపు



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర పర్యాటకంపై దృష్టిసారిస్తోందని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. రాష్ట్రంలోని ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్తే మూడు నాలుగు రోజులు అక్కడే ఉండేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖపట్నంలో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టూరిజం ట్రావెల్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. సినిమాల చిత్రీకరణ జరిగితే రెవెన్యూ పెరుగుతుందని మంత్రి చెప్పారు. టికెట్ల ధరలు పెంచాలని అడుగుతున్నారని, తెలుగు సినిమాలకు తప్పకుండా సహకారం అందిస్తామని, అంతకంటే ముందు చిత్ర పరిశ్రమ విజయవాడకు తరలివస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుందని ఆయన అన్నారు. ఎక్కువ పెట్టుబడులు పెట్టే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదని, అందుకే పీపీపీ విధానంపై దృష్టిపెడుతున్నామని తెలిపారు. అందరి సలహాలు తీసుకొని అందరికీ అనుకూలంగా ఉండేలా త్వరలో టూరిజం పాలసీ తీసుకొస్తామని చెప్పారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద రాష్ట్రానికి త్వరలో రూ.1000 కోట్లు కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి దుర్గేశ్ చెప్పారు. రాష్ట్రంలో భారీ తీర ప్రాంతం ఉన్నా బ్లూ ఫాగ్ బీచ్ ఒక్కటే ఉందని అన్నారు. మిగిలిన బీచ్‌లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఏపీలోని పర్యాటక ప్రాంతాలపై అందరూ కలసి ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో చిత్రీకరణ జరుగుతున్న ప్రాంతాల అసలైన పేర్లను సినిమాల్లో ప్రస్తావించాలన్నారు. అప్పుడే ఈ ప్రాంతాల గురించి అందరికీ తెలుస్తుందని అభిప్రాయపడ్డారు.

# హెూటళ్లకు బాంబు బెదిరింపు.. ఉలిక్కిపడ్డ తిరుపతి




తిరుపతి ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:
తిరుపతిలో బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. స్టార్ హెూటళ్లను పేల్చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. లీలామహల్ సమీపంలోని మూడు ప్రైవేటు హెూటళ్లు, కపిలతీర్థం, అలిపిరి సమీపంలోని హెూటళ్లకు మెయిల్స్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. నగదు ఇవ్వాలని, లేదంటే చంపుతామని, మీ హెూటళ్లలో పలుచోట్ల బాంబులు పెట్టామని హెచ్చరించినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. హెూటల్స్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఎక్కడా పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. బాంబు బూచీ సమాచారంతో నగర వాసులు ఉలిక్కి పడ్డారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మెయిల్ ఎవరుచేశారు, ఎక్కడి నుంచి వచ్చాయనే విషయంపై ఆరాతీస్తున్నారు. తిరుపతి విమానాశ్రయంలో స్టార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎస్5-154 విమానానికి బాంబు బెదిరింపు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆదమ్‌లాన్‌జా 333 పేరుతో ఉన్న ఎక్స్ ఖాతా నుంచి బెదిరింపు మెసేజ్ పంపినట్లు చెప్పారు. వెంటనే అప్రమత్తమై ఎయిర్?పోర్టుకు సమాచారం అందించినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కానుకల రూపంలో శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి రూ.2,58,56,737 కోట్ల ఆదాయం

నంద్యాల ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్న ఆలయంలో ఉభయ ఆలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల ఉభయ ఆలయాలు, పరివార దేవాలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు. చంద్రవతి కళ్యాణ మండపంలో పకడ్బందీగా ఈ లెక్కింపు నిర్వహించగా శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి రూ.2,58,56,737 కోట్ల నగదు ఆదాయంగా లభించిందని ఇంఛార్జి ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ ఆదాయాన్ని గత 28 రోజులులో శ్రీ స్వామి అమ్మవార్లకు భక్తులు నగదును కానుకల రూపంలో సమర్పించినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో నగదుతో పాటు 379 గ్రాముల 500 మిల్లి గ్రాములు బంగారం అలానే వెండి 8 కేజీల 30 గ్రాములు లభించగా, నగదు బంగారుతో పాటు 1093 యూఏఈ దిర్హమ్స్, 21 యుఎస్ఏ డాలర్లు, 215 మలేషియా రింగిట్స్, 10 మారీటియస్ రూపాయలు, కెనడా డాలర్లు 20 యుకే పౌండ్సు, మాల్దీవ్స్ రుఫీయాస్ 10,ఈరోస్ 102- సింగపూర్ డాలర్లు, 25 ఈ హుండీ లెక్కింపులో లభించాయని ఆలయ ఇంఛార్జి ఈవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పటిష్టమైన నిఘా నేత్రాల మధ్య ఆలయ ఇంఛార్జి ఈవో చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరగగా లెక్కింపులో దేవస్థానం అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఐకాన్ స్టార్ కు హైకోర్టులో ఊరట



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కి ఎపి హైకోర్టులో ఊరట లభించింది. ఏపీ అసెంబ్లీ ఎలక్షన్స్ సమయంలో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనే కారణంతో నంద్యాల పోలీసులు అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసును కొట్టేయాలంటూ అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణకు రాగా.. ఎఫ్ఐఆర్ ఆధారంగా నవంబరు 6 వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. అలాగే ఈ కేసుకు సంబంధించి నవంబరు 6న తుది తీర్పు ఇవ్వనున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.ఏపీ అసెంబ్లీ ఎన్నికల వేళ నంద్యాల శాసనసభ వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఇంటికి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వెళ్లారు.. విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు ఆయన్ను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా నంద్యాలలో అల్లు అర్జున్, శిల్పా రవి ర్యాలీ నిర్వహించారంటూ పోలీసులకు రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు చేశారు. ఆర్వో ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అల్లు అర్జున్, శిల్పా రవిలపై కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్ 188 కింద ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు..

# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే నిర్వహణ.

### -సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత.

### -నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.




ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 25:
పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకుబుధవారం నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న 13 మంది పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీ కు స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియచేసినారు.

# జైన్ పరిశ్రమ ప్రారంభానికి సహకరిస్తాం

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.





**ఆంధ్ర ప్రగతి జూపాడుబంగ్లా/నంద్యాల, అక్టోబర్ 25:**
జైన్ పరిశ్రమ త్వరలో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం జూపాడుబంగ్లా మండలం తంగడంచలోని జైన్ ఇరిగేషన్ సిస్టం లిమిటెడ్ పరిశ్రమ పరిసరాలను నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య తో కలిసి పరిశీలించారు. జైన్ పరిశ్రమ అధికారులు తంగడంచ నుంచి ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యకలాపాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల నుంచి జైన్ పరిశ్రమకు అన్ని విధాల సహకరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానంగా తమిళనాడు, కేరళ రాష్ట్రం తరహాలో అరటి పంట కోత దశలో రైతులకు వ్యయం తగ్గించేందుకు రోప్ వే తరహా పద్ధతిని రాయలసీమ జిల్లాల్లో కూడా తీసుకురావాలని జైన్ అధికారులను కలెక్టర్ సూచించారు. వీలైనంత త్వరగా అరటి, బొప్పాయి తదితర పండ్ల మొక్కలను తంగడంచ నుంచి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని జైన్ అధికారులను ఆదేశించారు. తంగడంచ ఫామ్ లో ఉన్న 1600 ఎకరాల్లో విత్తనోత్పత్తి ఏ విధంగా తీసుకురావాలన్న అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో చర్చించి ముందుకు వెళ్తామన్నారు.
నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయ సూర్య మాట్లాడుతూ జైన్ పరిశ్రమ గత పాలకుల మూలంగా ముందుకు వెళ్లలేకపోయిందని ప్రస్తుతం ప్రభుత్వ హయాంలోనైనా జైన్ పరిశ్రమ ప్రారంభమయ్యేందుకు చర్యలు గైకొనాలని జిల్లా కలెక్టర్ ను విజ్ఞప్తి చేశారు. జైన్ పరిశ్రమలో 100% స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని జైన్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ ఎం దాసు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, జైన్ పరిశ్రమ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ బాబు, తంగడంచ ఇంచార్జ్ మహేంద్ర బాబు, లైజనింగ్ అధికారి మౌలాలి, జూపాడుబంగ్లా తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# అందరూ చూడదగ్గ సినిమా రంగస్వామి సినిమా

### -ఎన్ఎండి ఫిరోజ్





ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 25:
మన నంద్యాల అభిరామ్ థియేటర్లో బుధవారం రిలీజ్ అయినటువంటి రంగస్వామి సినిమాను అందరూ చూడదగ్గ సినిమా అని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల ప్రేక్షకులు ఈ సినిమాను వీక్షించి ఇటువంటి సినిమాలు సమాజానికి ఎంతో అవసరమని, తల్లిదండ్రులు పిల్లలని ప్రేమతో పాటు బాధ్యతతో కూడా వారి భవిష్యత్తులో ఎటువంటి చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండే విధంగా ఎదగాలని దర్శకులు నరసింహ చారి రంగస్వామి సినిమా లో చాలా చక్కగా చిత్రీకరించారు అని ,అందరూ కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా అని కొనియాడడం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి సినిమాలు యువతకు ఎంతో అవసరమని రాయలసీమ నుంచి ఇలాంటి సినిమాలు మరిన్ని రావాలని కూడా వారు ఆశించారు. అనంతరం నిమ్మకాయల సుధాకర్, ఖండే శ్యాంసుందర్, ఈ సినిమాలో ప్రధాన పాత్రధారి డాక్టర్ మారుతి సకారాం , పాటల రచయిత ఉసిరికాయల వెంకటేష్ , మరియు ఇందులో నటించినటువంటి తారాగణం, ఐలుక్ యాడ్స్ సీఎండీ శ్రీనివాస్ నాయుడు లతోపాటు సినిమాను వీక్షించారు.

# పోలీసు సిబ్బందికి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు



ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 25:
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సైబర్ క్రైమ్ నేరాలు నియంత్రణలో యువత పాత్ర అనే అంశాలపై నంద్యాల అడిషనల్ ఎస్పీ ఏన్ .యుగంధర్ బాబు ఆధ్వర్యంలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలు ప్రభుత్వ ఉపాధ్యాయుల సమక్షంలో నిర్వహించడం జరిగింది. వీటి యొక్క ముఖ్య ఉద్దేశం సిబ్బంది యొక్క ప్రతిభను వెలికి తీసి ప్రజా శ్రేయస్సు వారి భద్రత కోసం,పోలీస్ వారు అందిస్తున్న సేవలను త్యాగాలను,దైనందిన విధులను ప్రజలకు వివరించాలని సదుద్దేశంతో మరియు ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతున్న ధర్మంలో వాటిని నియంత్రించేందుకు మరియు నేరాలు జరగకుండా అవగాహన పెంచుకొని ప్రజలకు మంచి సేవలు అందించాలని సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 5000/- రూపాయలను రెండవ బహుమతిగా 3000/- రూపాయలను మూడో బహుమతిగా 2000/- రూపాయలను ఇవ్వడం జరుగుతుందని పోలీస్ అధికారులు తెలియజేశారు.

# రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్ కు వెలాసిటి విద్యార్థి



ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 25:
నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం నందుగల నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీనందు ఎస్ జి ఎఫ్ వారు సెప్టెంబర్ 24వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్ సెలక్షన్స్ కు వెలాసిటీ జూనియర్ కాలేజ్ విద్యార్థి ఎస్. షాహిద్ పాల్గొని రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్ కు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల లో ఏర్పాటు చేసిన అభినందన సభ లో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మాధవీ లత మాట్లాడుతూ.. చదువుతోపాటుగా ఆటల్లో రాణించటానికి విద్యార్థులకు తగిన ప్రోత్సాహాన్ని కళాశాల ఎల్లప్పుడూ అందిస్తుందని , విద్యార్థులు వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో పాల్గొని మంచి పురోగతిని సాధించాలని కోరారు . ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ .శ్రీనివాసరావు వైస్ ప్రిన్సిపల్ వంశీ చైతన్య మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గురుమోహన్ మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# 21 వ అఖిల భారత పశుగణన పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి ఫరూక్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 25:
నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు డాక్టర్ జి.గోవింద నాయక్ (డిఏహెచ్ఓ) , డాక్టర్ కె శ్రీనివాసరావు డిడి(ఎహెచ్) , డాక్టర్ ఎస్.సి.వి సుబ్బా రెడ్డి (ఏడి) (ఏహెచ్) (ఏవీహెచ్) నంద్యాల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 తేదీ నుండి 28 వరకు జరుగు పశు గణన పోస్టర్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ మీ ఇంటికి వచ్చే విషయ సేకరణ దారులకు మీ పశువుల సమగ్ర సమాచారం అందించాలని కోరారు తద్వారా పశుగణ రంగ పథకాల రూపకల్పన సహకరించిన వారవుతారన్నారు.

# అల్పపిడన ప్రభావం వల్ల నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలి

### -సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీజిల్లా నాయకుడు గాలి రవిరాజ్ డిమాండ్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 25:
నంద్యాల జిల్లాలో అల్పపీడన ప్రభావం వలన నష్టపోయిన పంటలను అంచనా వేసి నష్టపరిహారం అందించాలని సిపిఐ (యం యల్ ) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు అనంతరం ఆళ్లగడ్డ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అల్పపీడన ప్రభావం వలన వర్షాలు కురిసి జిల్లాలో రైతులు నష్టపోయారని అందువలన అధికారులు జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన పంటలను అంచనా వేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో అసలు వ్యవసాయ అధికారులు పనిచేస్తున్నారా అకాల వర్షాలు అల్పపిడన లతో రైతులు నష్టాలతో అల్లాడుతుంటే ఒక్క అధికారి గాని నాయకుడు గాని రైతు లను పరామంచిన పాపన లేదన్నారు రాష్ట్రం లో రైతు భరోసా ఎంతమంది అకౌంట్ లలో జమ చేశారో రాష్ట్ర ప్రభుత్వం చెప్పగలుగుతుందా అని వారు సూటిగా ప్రశ్నించారు. మాది ప్రజల ప్రభుత్వం అని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎన్ని అమలు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చన తరువాత రెడ్ బుక్ పేరుతో పగలుభాలు పలుకుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలి వేషారన్నారు భక్తి పారావశంలో మన పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో మహిళలపైన చిన్న పిల్లల పైన అత్యాచారాలు అఘాత్యాలు జరుగుతున్న వేదాలు వలీస్తున్నారు. గాని సమస్యల పట్లనైనా కనీసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మాట్లాడకపోవడం చాలా విడురంగా ఉందన్నారు ఇకానైనా పాలకులు పగలుభాలు పక్కన పెట్టి ప్రజా సమస్యల పట్ల దృష్టి సారించి పాలన కొనసాగించాలని వారు హితువు పలికారు.

# పెసరవాయి ఫ్యాక్షన్ పికెట్ ఆకస్మిక తనిఖీ...

## గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు.

### -ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ ఎం . పార్థసారధి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 25:**
నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ గడివేముల పోలీస్ స్టేషన్ పరిధిలోని పెసరవాయి పోలీసు ఫ్యాక్షన్ పికెట్ ను ఆకస్మిక తనిఖీ చేసి గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసిన ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ ఎం . పార్థసారథి.
ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ పెసరవాయి గ్రామంలోని పరిస్థితులపై సిబ్బంది అడిగి తెలుసుకుని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి వచ్చిన వారిపై నిఘా ఉంచాలని ,గ్రామంలో అల్లర్లు గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉంటూ ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు అధికారులకు సమాచారం అందించాలని తెలియజేశారు. అనంతరం పెసర వాయి గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో అందరూ ఐక్యమత్యంతో ఉండాలని, నేర నియంత్రణకు పోలీసులు తీసుకునే చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, గొడవలకు అల్లర్లకు దూరంగా ఉండాలని, ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు వెంటనే పోలీసు వారిని ఆశ్రయించాలని తక్షణమే మీకు రక్షణ కల్పిస్తారని, కావున ప్రజలందరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలియజేస్తూ అందరూ శాంతియుతంగా జీవనం సాగిస్తూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# డయేరియా పరిస్థితిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ సమీక్ష

### డయేరియా అదుపులో ఉందని కలెక్టర్ల వివరణ

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:
పల్నాడు జిల్లా దాచేపల్లిలో డయేరియా పరిస్థితిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ శుక్రవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులతో మంత్రి మాట్లాడారు. ప్రస్తుతం దాచేపల్లిలో డయేరియా అదుపులోనే ఉందని మంత్రికి కలెక్టర్ చెప్పారు. కొత్తగా ఎలాంటి కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యాధికారులు తెలిపారు. మరోవైపు స్థానికంగా ఉన్న బోర్లను మూసివేసి నగరపంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారు. కాగా.. దాచేపల్లిలో నగర పంచాయతీలోని అంజనాపురం కాలనీలో డయేరియా ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వ్యాధి తీవ్రతో ఇప్పటికే ఇద్దరు మృతువాత పడగా, 16 మంది వాంతులు, విరేచనాలతో బాధుపడుతున్న పరిస్థితి. అయితే కలుషిత మంచి నీరు తాగడం వల్లే అతిసారం ప్రబలిందని అధికారులు నిర్ధారించారు. తాగునీటి పైపు లైన్లు మురుగు కాలువలో ఉండటం వల్ల నీరు కలుషితమై ఉండవచ్చని భావిస్తున్నారు.



డయేరియాతో డిగ్రీ విద్యార్థి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు (21), బండారు చిన వీరయ్య(63) మృతి చెందారు. వీరు ఇద్దరు మృతి చెందడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి నేతృత్వంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందజేస్తున్నారు. కాలనీలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ శిరి గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కాలనీలో పరిస్థితిని సమీక్షించారు. వ ం ో వ ్ ్ ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా దాచేపల్లి పరిస్థితిపై ఆరా తీసిన విషయం తెలిసిందే. డయేరియాతో ఇద్దరు చనిపోయిన విషయంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన సీఎం.. డయేరియాకు కలుషిత నీరు కారణమా లేక.. వేరే కారణాలు ఏమన్నా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే దాచేపల్లిలో పరిస్థితిని ముఖ్యమంత్రికి కలెక్టర్ వివరించారు. బోర్లను మూసి వేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలంటూ సీఎం చంద్రబాబు ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఈరోజు స్థానికంగా ఉన్న బోర్లను మూసివేసిన నగరపంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

దుర్గమ్మ సేవలో మంత్రి నారాయణ

కాగా ఉదయం మంత్రి నారాయణ విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సంద్భంగా మంత్రికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు. అలాగే ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి లడ్డు ప్రసాదాన్ని , చిత్రపటాన్ని మంత్రి నారాయణకు అందించారు.

# దీపావళి షాప్‌లకు భూమిపూజ చేసిన ఎన్ఎండి ఫిరోజ్ , ఎన్ఎండి ఫయాజ్.





ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 25:
నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ నందు తిరువీధి మణికంఠ ఆధ్వర్యంలో క్యాకర్స్ అమ్మడానికి ఏర్పాట్లు చేస్తున్న క్యాకర్స్ షెడ్లకు నంద్యాల టిడిపి ఇచ్చిన ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని భూమి పూజ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ , ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ.. నంద్యాలలో క్రాకర్స్ షెడ్ లకు భూమి పూజ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు అలాగే ఈ దీపావళి పండుగ అందరూ సంతోషంగా జరుపుకోవాలని ప్రతి ఒక్కరి ఇంట్లో సుఖశాంతులు వెదజల్లాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పబ్బతి వేణు ఎగ్జిబిషన్ శీను, బాబుల్లా ఇసుక చాంద్, గుల్లి, అలీ, ప్రధమనంది ఆలయ పూజారి ప్రవీణ్ మరియు గవర్నమెంట్ కాలేజీ ప్రిన్సిపల్ మరియు లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గార్మి వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్

ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 25:
నంద్యాల పట్టణం 26 వ వార్డు దేవనగర్ టిడిపి నాయకులు మల్లెల విజయభాస్కర్ , షేక్ ఖాజా నిర్వహించిన గార్మి వేడుకల్లో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని, పూజలు చేసి, అల్లా దీవెనలు తీసుకున్నారు.




ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ అల్లా దయవల్ల నంద్యాల నియోజకవర్గం ప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని, కుల మతాలకతీతంగా గార్మి పండుగ జరుపుకోవడం చాలా సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్ల భాష ,బోయ వెంకటేష్, విజయుడు, షఫీ, బేగ్, విజయ్, దర్గా, గుల్లి ఒకటో వార్డు కౌన్సర్ నాగార్జున, మాజీ కౌన్సిలర్ దస్తగిరి, ఇసుక చాంద్ సభ్యులు షఫీ, రఫీ 26 వార్డ్ దేవనగర్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# చంచల్‌గూడ నుంచి జానీ మాస్టర్ విడుదల

### లైంగిక వేధింపులు, పోక్సో కేసులో నిందితుడు

హైదరాబాద్,ంధ్ర ప్రగతి అక్టోబర్ 25: అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కుంటున్న ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ శుక్రవారంచంచల్ గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదల అయ్యారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో చంచల్ గూడ జైలు నుంచి
బయటకు వచ్చారు. 36 రోజులు పాటు ఆయన చంచల్ గూడ జైల్లో ఉన్నారు. లైంగిక వేధింపులు, పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న జానీ మాస్టర్‌ను రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు గోవాలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గోవా స్థానిక కోర్టులో ప్రవేశపెట్టి పీటీ వారెంట్ తీసుకుని.. హైదరాబాద్ తీసుకువచ్చారు. జానీ మాస్టర్‌పై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు సంబంధించి జీరో ఎఫ్ఐఆర్ కాగా, అదే రోజున నార్సింగ్ పోలీసులు మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం బాధితురాలి వాంగ్మూలాన్ని సేకరించారు. తనపై జానీ మాస్టర్ లైంగిక దాడికి పాల్పడ్డట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను మిన్నకుండిపోవడాన్ని అవకాశంగా తీసుకుని, తరచూ షూటింగ్ ప్రదేశాల్లో వేధించేవాడని.. వ్యానిటీ వ్యాన్‌లో తన కోరిక తీర్చాలంటూ బలవంతపెట్టేవాడని వివరించారు.



ఒప్పుకోకుంటే తన జుట్టు పట్టుకుని దాడి చేసేవాడని.. ఓ సందర్భంలో అద్దంతో నా ముఖంపై కొట్టాడని వాపోయారు. మాట వినకపోతే.. షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందు అవమానపరిచేవాడని, అసభ్యంగా తాకేవాడని తెలిపారు. మతం మారి, తనను పెళ్లి చేసుకోవాలని హింసించేవాడని చెప్పారు. జానీ మాస్టర్ వేధింపులు పెరగడంతో.. తాను సొంతంగా పనిచేయడం ప్రారంభించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపారు.

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో నేడు టీడీపీ సభ్యత్వ నమోదు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 25:
నంద్యాల పట్టణంలోని రాజారెడ్డి ఫంక్షన్ హాల్ లో ఈ నెల 26 వ తేది శనివారం సాయంత్రం 4 గంటలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి శుక్రవారం చెప్పారు. నంద్యాల పట్టణం, నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఏర్పాటు చేసిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని, ఈ కార్యక్రమం నకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డిలు హాజరు అవుతున్నట్లు టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి వివరించారు.



# తిరుమలను దర్శించుకున్న రామ్మోహన్‌నాయుడు



తిరుపతి ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25: కేంద్ర పౌరవిమానాయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం తిరుమలను దర్శించుకున్నారు. తెల్లవారుజామున వీఐపీ దర్శన సమయంలో సతీసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేంద్ర మంత్రి రాక సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయం బయట మీడియాతో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడిచిన నాలుగు నెలల్లో తిరుమల ను ప్రక్షాళన చేశామని, తిరుమలకు వచ్చే భక్తులు నేడు చాలా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం సమన్వయంతో రాష్ట్రం గాడిలో పడిందని అన్నారు. ఏపీని అభివృద్ధి చేసే దిశగా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు.
తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 9 కంపార్టుమెంట్లలో వేచియుండగా టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 61,004 మంది భక్తులు దర్శించుకోగా 20,173 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 3.48 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

### టీడీపీ ఆఫీసుపై దాడి కేసు నిందితుడు చైతన్య మూడ్రోజుల సీఐడీ కస్టడీకి అనుమతించిన న్యాయస్థానం



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:
మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఇటీవల కోర్టులో లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ కేసులో చైతన్య ఏ1 నిందితుడిగా ఉన్నాడు.
చైతన్యను కస్టడీకి అప్పగించాలని ఇటీవల సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన మంగళగిరి కోర్టు చైతన్యను మూడ్రోజుల కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో, చైతన్యను ఇవాళ్టి నుంచి మూడ్రోజుల పాటు సీఐడీ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ఈ క్రమంలో, నేడు చైతన్యకు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల నివేదిక వచ్చిన అనంతరం అతడిని సీఐడీ కార్యాలయానికి తరలించనున్నారు.

# నేటినుంచి టిడిపి సభ్యత్వ నమోదు

### పార్టీ నేతలతో సిఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నుంచి ప్రారంభం కానుంది. దీంతో కార్యక్రమం అమలుపై ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. పార్టీని బలోపేతం చేయడం, నామినేటెడ్ పదవుల భర్తీపై ఉండవల్లిలోని తన నివాసంలో నేతలతో చర్చించారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే తెదేపా సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేలా తెదేపా ఏర్పాట్లు చేస్తోంది. రూ.100 సభ్యత్వంతో తెదేపా కార్యకర్తలకు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనున్నారు. అలాగే, రెండో దఫా నామినేటెడ్ పదవుల భర్తీపై ఉదయం నుంచి మూడు గంటల పాటు నేతలతో సీఎం చర్చించారు. సాధ్యమైనంత త్వరగా రెండో లిస్ట్ విడుదల చేసేలా కసరత్తు చేస్తున్నారు. మొదటి దశలో ఇచ్చిన 21 నామినేటెడ్ పదవులకు రెట్టింపు సంఖ్యలో రెండో జాబితా ఉంటుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కూటమి పక్షాలతోనూ చంద్రబాబు సంప్రదింపులు జరుపుతున్నారు. కష్టపడిన వారికే పదవి అనే విధానంలో భాగంగా నామినేటెడ్ పోస్టులకు ఎంపికపై చర్చించారు.

# డేటాఫ్ బర్త్ కు ఆధార్ ప్రామాణికం కాదు

## సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**ఆధార్ కేవలం గుర్తింపు కోసమేనని గుర్తు చేసిన సుప్రీం కోర్టు**
**డేట్ ఆఫ్ బర్త్ నిర్ధారణకు ఆధార్ ప్రామాణికం కాదని స్పష్టీకరణ**
**పాఠశాల రికార్డులో ఉన్న పుట్టిన తేదీనే పరిగణనలోకి తీసుకోవాలన్న సుప్రీం**




అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 25:
డేట్ ఆఫ్ బర్త్ నిర్ధారణకు ఆధార్ ప్రామాణికం కాదని, పాఠశాల రికార్డులో ఉన్న పుట్టిన తేదీనే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో పంజాబ్ %-% హర్యానా హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు పక్కన పెట్టింది. రోడ్డు ప్రమాద బాధితుడికి పరిహారం చెల్లించే పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. యూఐడీఏఐ ఇచ్చిన తాజా సర్క్యులర్ ప్రకారం .. ఆధార్ కేవలం గుర్తింపు కోసమేనని, పుట్టిన తేదీకి రుజువు కాదన్న విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం గుర్తు చేసింది. విషయంలోకి వెళితే .. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ వ్యక్తికి రూ.19.35 లక్షల పరిహారం చెల్లించాలని రోహ్‌తక్‌లోని మోటారు యాక్సిడెంట్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. ఆ తర్వాత ఈ కేసు పంజాబ్ %-% హర్యానా హైకోర్టుకు చేరింది. స్థానిక ట్రైబ్యునల్ వయసును తప్పుగా పరిగణనలోకి తీసుకొని నిర్ణయం తీసుకుందని హైకోర్టు పేర్కొంటూ పరిహారాన్ని రూ.9.22 లక్షలకు కుదించింది. బాధితుడి ఆధార్ కార్డు ఆధారంగా వయస్సు 47 ఏళ్లుగా నిర్ధారించి పరిహారం లెక్కకట్టినట్లు పేర్కొంది.
దీనిని సవాల్ చేస్తూ, బాధిత కుటుంబ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పాఠశాల రికార్డుల ప్రకారం బాధితుడి వయసు 45 ఏళ్లు మాత్రమేనని అతని తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. దీంతో జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం .. ఆ వాదనతో ఏకీభవిస్తూ.. మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్ తీర్పును సమర్థించింది.

# రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు.

### -తహశీల్దార్ రమాదేవి.

ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 25:
రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పి.రమాదేవి తెలిపారు. శుక్రవారం మహానంది మండలం మసీదుపురం గ్రామంలో గ్రామసభను టిడిపి నాయకులు, మండల యూనిట్ ఇన్చార్జి నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో నిర్వహించిన భూ రీ సర్వేలో లోపాలు ఉన్నట్టు ఈ ప్రభుత్వం గుర్తించి, వాటిని పరిష్కరించడానికి గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ గ్రామ సభల్లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. ప్రతి సమస్యకి రసీదు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. 6 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించడం జరిగిందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీసర్వేలో వచ్చిన భూ సమస్యల వినతులను గ్రామసభలో స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తాహసిల్దార్ కామేశ్వర్ రెడ్డి, ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వో మోహన్, టిడిపి నాయకులు ఒంటెద్దు ప్రతాప్ రెడ్డి, అధికారులు,సచివాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

